క్లుప్తంగా

గణిత ఉపకరణాలతో మెరుగైన బోధన



మూలపాడు(ఇబ్రహీంపట్నం): గణిత ఉపకరణాలతో మెరుగైన బోధన చేయవచ్చని విజయవాడ కేబీఎన్ కళాశాల గణిత విభాగాధిపతి కల్మా బేగం అన్నారు. కేబీఎన్ కళాశాల ఆధ్వర్యంలో రూ.20వేల విలువైన గణిత ఉపకరణాలను మూలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం డేవిడ్‌రాక్ పెల్లర్‌కు బుధవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ సమాజ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధులతో సొంతంగా నాణ్యతతో తయారు చేయించిన గణిత ఉపకరణాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. డైరెక్టర్ శ్రీహరి మాట్లాడుతూ ఉపకరణాలతో విద్యార్థుల్లో గణితంపై మంచి అభిరుచి కలిగించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు కప్పగంతుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

తిరువూరు: స్థానిక గ్రేడ్–1 శాఖా గ్రంథాలయానికి తిరువూరు మండల సర్వేయర్ గోపాలకృష్ణ పోటీపరీక్షల మెటీరియల్‌ను బుధవారం వితరణగా ఇచ్చారు. గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు సురేష్‌బాబు ఈ మెటీరియల్‌ను గ్రంథాలయాధికారి పద్మావతికి అందజేశారు. రూ.18వేల విలువైన పుస్తకాలను ఏపీపీఎస్సీ గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడే విధంగా అందుబాటులో ఉంచినట్లు గ్రంథాలయాధికారి తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

నూజివీడు: పట్టణంలోని కోట మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయ హుండీలోని కానుకలను బుధవారం లెక్కించారు. 28 రోజులకు సంబంధించి హుండీని తెరిచి లెక్కించగా రూ.2,63,802 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణచార్యులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

నూజివీడు: పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీదేవి, సర్పంచ్ తగరం సుజాత అన్నారు. మండలంలోని పోతురెడ్డిపల్లిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన వైస్ ఎంపీపీ, సర్పంచ్‌లు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్న దేశంలోనే ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యునికి చూపించుకున్న వారికి మందుల కిట్లను అందజేశారు.

నేడు రాష్ట్ర ప్రాజెక్ట్‌గా ఎస్ఎల్ఆర్ఎం ప్రకటన



జూపూడిలో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్ట్

జూపూడి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ఘన ద్రవ వ్యర్థాల నిర్వాహణ సంస్థ ఆధ్వర్యంలో జూపూడిలో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్ఎల్ఆర్ఎం (సాలిడ్ లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్) ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రాజెక్ట్‌గా ప్రకటిస్తారని గ్రామ పంచాయతీ కార్యదర్శి పి.అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ ఎస్ఆర్ సంపత్‌కుమార్ గురువారం జూపూడి సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ దేవమాత అధ్యక్షతన జరిగే సమావేశంలో జూపూడి మోడల్ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర మోడల్ ప్రాజెక్ట్‌గా ప్రకటిస్తారని పేర్కొన్నారు.

ప్రజా రక్షణ భేరీని జయప్రదం చేయండి

మైలవరం: బీజేపీ పాలనలో దేశం అస్తవ్యస్తంగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు ఆరోపించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరీని జయప్రదం చేయాలని కోరుతూ మైలవరం నూజివీడు రోడ్డు, విజయవాడ రోడ్డులో వ్యాపార దుకాణాలకు వెళ్లి బుధవారం కరపత్రాలు పంచి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రావూరి రమేష్‌బాబు, సీహెచ్ సుధాకర్, పీ జ్యోతి, ఆర్.సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన

పెనుగొలను(గంపలగూడెం): మిరప పరిశోధనా సుగంధ ద్రవ్యాల సంస్థ గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం గంపలగూడెం మండలం పెనుగొలను రైతు భరోసా కేంద్రంలో మిరప రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తిరువూరు ఉద్యానవనశాఖ అధికారి సోహెల్ అహ్మద్ తెలిపారు. మిరప సమగ్ర సస్యరక్షణ మిరప నాణ్యత ప్రమాణాల పెంపు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



గంపలగూడెంలో నిర్వహించిన రాష్ట్రావతరణ దినోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

గంపలగూడెం: ఆంధ్రరాష్ట్ర అవతరణకోసం తన ప్రాణాలను సైతం పణంగాపెట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఎన్నటికీ మరువలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. గంపలగూడెం గాంధీ సెంటర్‌లో రాష్ట్రావతరణ దినోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరజీవి చిత్రపటానికి మండలశాఖ అధ్యక్షుడు ఎస్. చిన్నసత్యంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్యసంఘం నాయకులు నరసింహారావు, రవి కుమార్, మురళీకృష్ణ, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. గంపలగూడెం, పెనుగొలను శాఖా గ్రంథాలయాల్లో గ్రంథాలయ అధికారులు నాగేశ్వరరావు, శ్రీలత ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీడీఓ అనూరాధ, సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవికి నివాళి

తిరువూరురూరల్: మండలంలోని చిట్టేల, లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూళ్లలో అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం పూలమాలలువేసి నివాళులర్పించారు. రాష్ట్ర అవతరణకు పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ చేసిన వైనాన్ని ఉపాధ్యాయులు తెలియజేశారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన చేసిన పోరాటపటిమ నేటి యువతకు ఆదర్శమని సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ మునగాల శివారెడ్డి, నిడిముక్కల శివశంకరరావు, నల్లమోతు ప్రకాష్, పండు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. కొండపల్లి టౌన్ కన్వీనర్ మిక్కిలి శరభయ్య ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ అధ్యక్షుడు ఎంఎ.బేగ్, నాయకులు పాల్గొన్నారు. మున్సిపాల్టీ కార్యాలయంలో కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విజయలక్ష్మి, పోలీస్ సిబ్బంది నివాళులర్పించారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం, మరెందరో నాయకుల పోరాట ఫలితంగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అని జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అమరజీవి పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలగాని తిరుపతిరావు, సొసైటీ అధ్యక్షుడు బత్తుల శ్రీనివాసరెడ్డి, ముచ్చనపల్లి సర్పంచ్ జమలయ్య, కలకొండరామారావు, తహసీల్దార్ పాల్, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

తిరువూరులో..

తిరువూరు: రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం అమరజీవి పొట్టిశ్రీరాములుకు వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్మన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహనరెడ్డి, విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థాన పాలకవర్గ సభ్యుడు దేవిశెట్టి బాలకృష్ణ, నగరపంచాయతీ వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, ఏరువ ప్రకాష్‌రెడ్డి, ఏపీ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు జాకీర్, గత్తం నాగేశ్వరరావు, జే శ్రీనివాసరావు, ఏసురత్నం పాల్గొన్నారు. తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో, రాజుపేటలో అమరజీవి విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘ నాయకులు గుడిమెట్ల మురళి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు దోనపాటి రవికుమార్ నివాళులర్పించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: స్థానిక మండలపరిషత్ కార్యాలయం మీటింగ్ హాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి నివాళులర్పించారు. మాజీ వైస్ ఎంపీపీ దుర్గారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ శివబాజీ, జిల్లా కమిటీ సభ్యుడు ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి పాల్గొన్నారు.

మైలవరంలో..

మైలవరం: ఆంధ్ర ప్రదేశ్ అవతరగణ దినోత్సవాన్ని మైలవరంలో బుధవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నూజివీడు రోడ్డులోని మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం మండల కార్యదర్శి కాజా మహేష్, నారికంపల్లి గాంధీ, సూరిబాబు, చారుగుండ్ల ప్రసాద్, కుమార్ కృష్ణమూర్తి, జగన్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: తెలుగువారి బతుకుల్లో వెలుగులు నింపేందుకు జీవితాన్ని త్యాగం చేసి, పొట్టి శ్రీరాములు అమరజీవి అయినారని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. మండలంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ ఉత్సవాలను బుధవారం నిర్వహించారు.



కొండపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తిరువూరు నియోజకవర్గ కార్యాలయంలో అమరజీవికి నివాళి



జి.కొండూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ



తిరువూరు మండలం చిట్టేలలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళి



ఇబ్రహీంపట్నం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అమరజీవికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



విస్సన్నపేటలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ మెర్సీవనజాక్షి



రెడ్డిగూడెంలో పొట్టి శ్రీరాముల చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి

ఎస్ఈఏఎస్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

- మండలంలో 41 పాఠశాలల ఎంపిక
- పరీక్ష రాయనున్న 1,751 మంది విద్యార్థులు

నూజివీడు: విద్యావ్యవస్థలో నూతనంగా అమలవుతున్న అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేసేందుకు స్టేట్ ఎడ్యుకేషన్ ఎచీవ్‌మెంట్ సర్వే–2023(ఎస్ఈఏఎస్)లో భాగంగా మండలంలో ఈ నెల మూడో తేదీన నిర్వహించే పరీక్షకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహించనున్నారు. ఈ విద్యా సర్వే ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన స్థాయిలపై ఒక అంచనా రానుంది. దీని ఆధారంగా నిర్మాణాత్మకమైన నివేదికను అధికారులు రూపొందించనున్నారు. భాషా సబ్జెక్టు, గణితం సబ్జెక్టుల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇంగ్లిష్ మీడియంను ఎంపిక చేసుకుంటే ఇంగ్లిష్ సబ్జెక్టులోను, తెలుగు మీడియం అయితే తెలుగు సబ్జెక్టు పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్ష ద్వారా విద్యావిధానంలోని బలాలు, బలహీనతలు, లోపాలను అంచనా వేయడం, వాటిని సవరించుకోవడానికి చేపట్టాల్సిన మార్గాలను అన్వేషించుకునేందుకు వీలు కుదురుతుంది. ఓఎంఆర్ షీట్ల ద్వారా నిర్వహిస్తున్న ఈ పరీక్షను నిర్వహించేందుకు ఉపాధ్యాయులు కాకుండా ఇంజినీరింగ్ విద్యార్థులను ఇన్విజిలేటర్లుగా నియమించారు. ఈ పరీక్ష నిర్వహణకు గాను మండలంలో 41 పాఠశాలలను ఎంపిక చేయగా, మూడో తరగతి విద్యార్థులు 557 మంది, ఆరో తరగతి విద్యార్థులు 564 మంది, తొమ్మిదో తరగతి విద్యార్థులు 630 మంది పరీక్షలు రాయనున్నారు. సంబంధిత ప్రశ్నపత్రాలను ఎంపిక చేసిన పాఠశాలలకు పంపించేందుకు రిసోర్స్ పర్సన్ రాజేంద్రప్రసాద్ ఏర్పాట్లు చేశారు. పరీక్ష నిర్వహణకు ఎంపిక చేసిన ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇప్పటికే శిక్షణను పూర్తిచేశారు.

వైఎస్సార్ కాలనీలో సంక్షేమానికి రూ.45 కోట్లు

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో సంక్షేమం కోసం రూ.45 కోట్లు ఖర్చు చేసినట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని వైఎస్సార్ కాలనీలో గొల్లపూడి గ్రామ సచివాలయం–5ను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ కాలనీ అభివృద్ధికి స్థానిక మాజీ ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వరరావు ఒక్క పైసా అయినా ఖర్చు చేశారా అని ప్రశ్నించారు. ఉమాకు దమ్ము, ధైర్యం ఉంటే తన హయాంలో వైఎస్సార్ కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంత ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం జగనన్న పాలనలో కాలనీలో సంక్షేమం కోసం రూ.45 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు.

విజయవాడ సిటీలో విలీనం చేసేందుకు కృషి

వార్షికాదాయం తక్కువగా ఉన్న జక్కంపూడి పంచాయతీలో అప్పట్లో వైఎస్సార్ కాలనీని కలిపారని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలోని జక్కంపూడిలో వైఎస్సార్ కాలనీ ఉండటం వలన వీఎంసీ నుంచి కూడా నిధుల కేటాయింపు లేదన్నారు. గత డీ లిమిటేషన్ ప్రక్రియలో సరిచేసి ఈ కాలనీని విజయవాడ సిటీలో విలీనం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాటమనేని పూర్ణ, ఎంపీటీసీ సభ్యులు సైదాబీ, సత్యనారాయణ, బయ్యారపు కల్పన పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



దిగవల్లిలో రైతులకు సూచనలు ఇస్తున్న మామిడి శాస్త్రవేత్త కనకమహాలక్ష్మి

నూజివీడు: మామిడి తోటల్లో రైతులు సమగ్రమైన యాజమాన్య పద్ధతులను ఉద్యానశాఖ అధికారుల సూచనలతో పాటించినట్లయితే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని మామిడి పరిశోధన స్థానం శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి అన్నారు. మండలంలోని దిగవల్లిలో ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా బుధవారం రైతులకు మామిడి తోటల్లో పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న శాస్త్రవేత్త రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. మామిడిలో పూత వచ్చేందుకు బ్లాక్ సల్ఫర్ మూడు గ్రాములు లీటరు నీటికి, మల్టీ కే 10గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.పురుగుల నివారణకు క్లోరీపైరిఫాస్ 20 ఈసీ 2.5 ఎంఎల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మామిడి శాస్త్రవేత్త కే రాధారాణి, సర్పంచ్ కొండలరావు, ఉద్యాన అధికారి రాజులపాటి హేమ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలను పూర్తి చేయండి

ఆగిరిపల్లి: మండలంలోని నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలు, సచివాలయ భవనాలు, వైఎస్సార్ విలేజీ క్లినిక్‌ల భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. ఆగిరిపల్లి, చిన్నాగిరిపల్లి, కనసానపల్లిలో బుధవారం పర్యటించిన సబ్‌కలెక్టర్ నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రూఫ్ లెవెల్లో ఉన్న భవనాలను ఈ నెలాఖరు కల్లా ఎట్టి పరిస్థితుల్లో పూర్తిచేయాలన్నారు. కాంట్రాక్టర్లకు సంబంధించి ఏమైనా పెండింగ్ బిల్లులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వాటిని చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. నెలల తరబడి భవనాలను నిర్మించకుండా వదిలేస్తే ఎలాగని నిలదీశారు. ప్రభుత్వ బిల్లులు ఎక్కడికీ పోవని, నిర్మాణ పనులు ప్రారంభించి సకాలంలో ఎందుకు పూర్తి చేయరని ప్రశ్నించారు. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. సబ్‌కలెక్టర్ వెంట ఎంపీడీఓ పీ శంకరరావు, పంచాయతీరాజ్ ఏఈ సూర్యనారాయణ పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

తెల్లవారుజామునే పింఛన్ల పంపిణీ

తిరువూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక సొమ్మును తిరువూరు నియోజకవర్గంలోని 40వేల మంది లబ్ధిదారుల ఇళ్లకు బుధవారం తెల్లవారుజామున వలంటీర్లు వెళ్లి అందజేశారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతు మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన పెన్షను నగదును లబ్ధిదారుల ఇంటి వద్దే పంపిణీ చేశారు. 80 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

ముసునూరులో..

ముసునూరు: వైఎస్సార్ పింఛన్ కానుకల పథకం పేదలకు మేలుచేస్తుందని ఎంపీడీఓ జి.రాణి పేర్కొన్నారు. బుధవారం తెల్లవారుజామునే పింఛన్లు పేదింటి తలుపులు తట్టాయి. మండలంలో 47శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

అందుబాటులో ఓటర్ల జాబితా : ఆర్డీఓ మాధవి

విస్సన్నపేట: ఓటర్ల జాబితా సవరణ ముసాయిదా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామని, త్వరలో డివిజన్ స్థాయిలో రాజకీయపార్టీ నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీఓ కొత్తా మాధవి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్డీఓ తనిఖీ నిర్వహించారు. భూములు రీ సర్వేకి సంబంధించిన రికార్డులను, కార్యాలయంలో పలు రికార్డులు పరిశీలించారు. తెల్లదేవరపల్లి, పుట్రేల పంచాయతీలోని కోటిపల్లి గ్రామంలో చుక్కల భూములకు సంబంధించి పరిశీలిస్తున్నామని ఆర్డీఓ పేర్కొన్నారు.



సాక్షి మీడియా గ్రూపు ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలోని హ్యాపీ వ్యాలీ స్కూల్లో బుధవారం నిర్వహించిన మ్యాథ్స్‌బీ పరీక్షలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మ్యాథ్స్ బీ పరీక్ష విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పోలీసు విధులను అడ్డుకున్న వారిపై కేసు నమోదు

ముసునూరు: పోలీసుల కళ్లుగప్పి కోళ్ల వ్యర్థాలను అక్రమ రవాణా చేస్తూ, వాహనాన్ని పట్టుకోబోయిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఏలూరు ప్రాంతంలోని చేపల చెరువులకు మండలంలోని కాట్రేనిపాడు మీదుగా వెళుతున్న కోళ్ల వ్యర్థాల వాహనాన్ని మంగళవారం అర్ధరాత్రి వాహన తనిఖీల్లో భాగంగా తుక్కులూరు సెంటర్‌లో నూజివీడు ట్రాఫిక్ ఎస్సై శాగం రాధాకృష్ణారెడ్డి ఆపబోగా, పోలీసులను చూసి డ్రైవర్ వాహనాన్ని వేగంగా నడుపుతూ వెళ్లాడు. పోలీసులు అనుమానంతో వాహనాన్ని వెంబడించగా, అర కిలోమీటర్ దూరం వెళ్లిన తరువాత కాట్రేనిపాడు శివార్లలో పోలీసుల వాహనానికి వారికే చెందిన ఒక కారును అడ్డం పెట్టారు. దీంతో కోళ్ల వ్యర్థలు నింపి ఉన్న వ్యాన్ వెళ్లి పోయింది. కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకునేలోపు అతను కూడా కారు వదిలి పారిపోయాడు. ట్రాఫిక్ ఎస్సై బుధవారం ఇచ్చిన ఫిర్యాదుతో కారులో ఉన్న మహిళ, డ్రైవర్లు ఇద్దరిపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తెగుళ్లను నివారించుకోవాలి

వలసపల్లి (ముసునూరు): మిర్చి పంటను ఆశించే తెగుళ్ల నివారణకు తక్షణ సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖాధికారి జ్యోతి ప్రియాంక సూచించారు. మండలంలోని వలసపల్లిలో సాగవుతున్న మిర్చి పంటను సిబ్బందితో కలసి బుధవారం పరిశీలించారు.

టెక్నాలజీలో మార్పులు గమనించాలి

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుని తదనుగుణంగా నైపుణ్యాలు అలవరచుకోవాలని కెరీర్ గైడెన్స్ నిపుణులు కే తేజోవంత్ సూచించారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు బుధవారం నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. అకడమిక్ అంశాలతో పాటు ప్రోగ్రామింగ్, డిజైనింగ్, కోడింగ్‌పై కూడా విద్యార్థులు పట్టు సాధించాలని, అభిరుచికనుగుణంగా కెరీర్ ఎంచుకోవాలని తెలిపారు. కెరీర్ గైడెన్స్ నిపుణుడు అమరనాథ్ టెక్నాలజీలో నూతన అంశాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, ఏటి కిషోర్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు చెల్లించండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు, ఆస్తి పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు కోరారు. 2023–24 ఏడాదికి సంబంధించిన ఇంటి పన్ను బకాయిలు, ఆస్తి పన్ను కొండపల్లి మున్సిపాల్టీ కార్యాలయం, ఇబ్రహీంపట్నం పాత పంచాయతీ కార్యాలయంలోని కౌంటర్ల వద్ద తగిన నగదు చెల్లించి రశీదు పొందాలని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు మున్సిపాల్టీ సిబ్బందికి సహకరించాలని కమిషనర్ సూచించారు.

రేపు మండల సమావేశం

ఏ.కొండూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవికాంత్ బుధవారం తెలిపారు. ఈ సమావేశంలో తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొంటారని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

అగ్నిప్రమాదాల నివారణపై సదస్సు

తిరువూరు: స్థానిక ఆస్టర్ రమేష్ అమరావతి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అగ్నిమాపక అధికారి మహబూబ్ ప్రమాదాలు జరిగే అవకాశాలు, వాటి నివారణ మార్గాలను తెలియజేశారు. అగ్నిప్రమాదం జరిగినపుడు ప్రాణనష్టం కలగకుండా బహుళ అంతస్తుల భవనాల్లో చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లను వివరించారు. ఆస్పత్రి చైర్మన్ కోనేరు వెంకటకృష్ణన్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల శాఖ ఎన్నిక

మైలవరం: నూతన విద్యా విధానం జీఓ 117ను రద్దు చేయాలని పీఆర్‌టీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ నవాబ్ జానీ, సోలా రాఘవరాజు కోరారు. మైలవరం పొందుగల రోడ్డులోని ఎంపీపీ నంబర్–4లో పీఆర్‌టీయూ మండల శాఖ కార్యనిర్వాహక వర్గ సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో పీఆర్‌టీయూ మండల శాఖ ఎన్నికలు నిర్వహించారు. మైలవరం మండలం గౌరవ అధ్యక్షుడిగా చిన్నోజు సతీష్‌కుమార్, అధ్యక్షుడిగా పీ గోపాల్, ప్రధాన కార్యదర్శిగా ఎం.వెంకటేష్, మండల జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

సులభరీతిన బోధించాలి

గంపలగూడెం: వెనుకబడిన విద్యార్థులకు సైతం అర్థమయ్యేలా సులభరీతిన ఉపాధ్యాయులు బోధించాలని నందిగామ డీవైఈఓ వెంకటప్పయ్య తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు. ప్యానల్ ఉపాధ్యాయుల చేత పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు బోధించాల్సి ఉందన్నారు. పాఠశాల హెచ్ఎం బి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

ముసుకుళ్ల(తిరువూరురూరల్): పాఠశాల క్రీడల్లో మండలంలోని మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ కీర్తి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం బీ వీరభద్రరావు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో కబడ్డీ విభాగంలో కీర్తి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని, శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయురాలు వేణి కృష్ణమ్మను ఎంఈఓ రామకృష్ణ, హెచ్ఎం బీ వీరభద్రరావు అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన కీర్తికి అభినందన